

నేడు సగం ధరలకే పుస్తకాలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం చిత్తూరు నగరంలోని పిసిఆర్ కళాశాల బస్టాప్ వద్ద సగం ధరలకే పుస్తకాల విక్రయం జరుగుతుందని జిల్లా అధ్యక్షులు గంటా మోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రదర్శనలో తెలుగు, ఆంగ్లం కవిత్వం, కథా సంపుటాలు, నవలలు, జీవిత చరిత్రలు, జనరల్ నాలెడ్జ్, వ్యక్తిత్వ వికాసం, ఆరోగ్య, ఆధ్యాత్మిక పుస్తకాలు లభిస్తాయి. ఆదివారం ఉదయం 7.30 నుండి 10.30 మళ్ళీ సాయంత్రం 3.30 నుండి 6. 30 గంటల వరకు ప్రదర్శన వుంటుంది. విజ్ఞానం తరగని ఐశ్వర్యం, ముఖ్యంగా విద్యార్థులకు బంగారు భవిష్యత్తు కనుక తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈఅపూర్వ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ప్రతిభకు వైకల్యం అడ్డు కాదు

దివ్యాంగ క్రీడాకారులను అభినందించిన కలెక్టర్



క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారిని అభినందిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రతిభకు వైకల్యం అడ్డుకాదని, పట్టుదల, కృషి ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చునని దివ్యాంగ క్రీడాకారులు నిరూపించారంటూ వారిని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అభినందించారు. శనివారం జిల్లా సచివాలయంలోని సమావేశం మందిరంలో 2025 ఫిబ్రవరి 2 నుండి 6వ తేదీ వరకు గుంటూరు మంగళగిరిలో జరిగిన పారాస్పోర్ట్స్ స్టేట్ లెవెల్ అసోసియేషన్ (విభిన్న ప్రతిభావంతులు) వారు నిర్వహించిన పోటీలలో బహుమతులు సాధించిన దివ్యాంగ క్రీడాకారులకు జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి చేతుల మీదుగా ప్రశంస పత్రాలు, మెమెంటోలు అందుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగ క్రీడాకారులు ఎంతో పట్టుదల, కృషితో ప్రతిభను కనపరిచి రాష్ట్రస్థాయి పోటీలలో గోల్డ్‌మెడల్స్, సిల్వర్ మెడల్ సాధించడం అభినందనీయమన్నారు. జాతీయస్థాయి పోటీలలో కూడా ఇలాగే ఉత్తమ ప్రతిభ కనబరిచి రాణించాలని సూచించారు. దివ్యాంగ క్రీడాకారుల అభ్యర్థన మేరకు రూ.25వేల విలువ చేసే స్పోర్ట్స్ మెటీరియల్‌ను, వీల్‌చైర్‌ను కూడా అందిస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లా క్రీడల అధికారి బాలాజీ, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మోహన్ బాబు, ఖోఖో అసోసియేషన్ ప్రెసిడెంట్ శరత్, అధికారులు క్రీడాకారులు పాల్గొన్నారు.

పిల్లల్లో మార్పు తీసుకురావాలి..

న్యాయమూర్తి రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి రమేష్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిన్న పిల్లలు తెలిసో.. తెలీకో.. చేసిన నేరాలు క్షుణ్ణంగా పరిశీలించి వారిలో మార్పులు తీసుకురావాల్సి బాధ్యత పోలీసు, చైల్డ్ వెల్ఫేర్ అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులదే అని వారు సమన్వయం చేసుకొని పనిచేయాలని 1వ అదనపు జిల్లా జడ్జి ఎస్.రమేష్ పేర్కొన్నారు. జువెనైల్ జస్టిస్ బోర్డ్ సంక్షేమ అధికారులు, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎంఎస్.భారతి, 3వ అదనపు సివిల్ జడ్జీ ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్ జెజెబి సంధ్య రాణి, 9వ అదనపు జిల్లా జడ్జి డాక్టర్ ఎన్.శ్రీనివాస్ రావు, 1వ అదనపు జిల్లా జడ్జి, ఇంచార్జి ఛైర్మన్, ప్రిన్సిపల్ జిల్లా జడ్జి జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ఎస్.రమేష్‌లతో కలిసి శనివారం స్థానిక జిల్లా కోర్టులోని న్యాయ సదన్ భవనంలో బాలల న్యాయ సంరక్షణ, రక్షణ చట్టం 2015పై పోలీస్ అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, చైల్డ్ వెల్ఫేర్ అధికారులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల న్యాయ సంరక్షణ, రక్షణ చట్టం 2015 పై పూర్తి అవగాహన కలిగి వుండాలని తెలిపారు. తెలుసో తెలియకో చట్టానికి విరుద్ధంగా నేరారోపణలు చేసిన పిల్లలను జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందుకు 24గంటల్లోగా హాజరపరచాలన్నారు. నేరారోపణలు చేసిన పిల్లలను కొట్టడం, మీడియా ముందుకు తీసుకురాకూడదన్నారు. పిల్లలు ఏ కారణం చేత నేరారోపణలు చేశారనే వివరాలను స్నేహపూర్వకంగా సైకాలజిస్ట్‌తో వారి వివరాలను తెలుసుకొని వారిలో మార్పు వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జువెనైల్ జస్టిస్ బాలల సంరక్షణ, రక్షణ చటం 2015లో ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. జువెనైల్ జస్టిస్ చట్టంపై నేడు పోలీసు అధికారులకు, చైల్డ్ వెల్ఫేర్ బోర్డ్ అధికారులు, చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ సభ్యులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. పోలీసు, మహిళ శిశు సంక్షేమ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు ప్రొబేషన్స్ ఆఫీసర్లు, న్యాయవాదులు, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ సూపరింటెండెంట్ ఆర్ఎస్ ప్రతిమ, చిత్తూరు ఉమ్మడి జిల్లాలోని సబ్‌ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

నేరాలు, శిక్షలపై అవగాహన



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మహిళల భద్రత, వారి రక్షణ కొరకు చిత్తూరు జిల్లా పోలీసులు అహర్నిశలు కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు 'మీ కోసం – మీ రక్షణ మా బాధ్యత' అన్న సూత్రంతో మహిళలు, బాలికలు భద్రంగా, స్వేచ్ఛగా జీవించేందుకు అనేక ముందడుగు చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో జిల్లా అంతటా ఉన్న బాలికల పాఠశాలలు, కాలేజీలు, హాస్టల్స్‌లో భద్రతా తనిఖీలు (సెక్యూరిటీ ఆడిట్) నిర్వహిస్తూ, విద్యార్థినులు సురక్షితంగా ఉండేలా పోలీసులు కృషి చేస్తున్నారు. ఈ సెక్యూరిటీ ఆడిట్‌లో భాగంగా స్కూల్స్, కాలేజీలు, హాస్టల్స్ పరిసర ప్రాంతాలు, ప్రహరీ గోడలు పరిశీలించారు. విద్యాసంస్థలు, హాస్టల్స్‌లో అమర్చిన సిసి కెమెరాలు వాటి స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించి సిసి కెమెరాలు లేని సంస్థలలో వెంటనే అమర్చాలని సంబంధిత అధికారులకు తెలిపారు. విద్యార్థినుల భద్రత కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, అనవసరంగా వేధించే అసాంఘిక వ్యక్తులపై గట్టి చర్యలు తీసుకునేలా ముఖ్యంగా ఈవ్‌టీజింగ్, వేధింపులు వంటి ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే బాలికలు, మహిళలు ఎదుర్కొనే నేరాలు, వాటి శిక్షలు, నేర నివారణ చర్యల గురించి వారికి అవగాహన కల్పించేందుకు విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, పోక్సో చట్టం వంటి వాటి గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మహిళా భద్రతపై అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తిని గమనిస్తే పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని తెలిపారు.

ఉపాధిలో పెండింగ్ బిల్లులు

- మెటీరియల్ నిధుల విడుదల జాప్యం
- రెండు నెలలుగా నిలిచిన నిధులు
- పనుల్లో లోపించిన పురోగతి..



యాదమరి మండలంలో పూర్తైన గోకులం షెడ్డు

ఉపాధి హామీ పథకానికి సంబంధించిన మెటీరియల్ నిధులు విడుదలలో కేంద్ర ప్రభుత్వం జాప్యంతో చిత్తూరు జిల్లాలో సిమెంట్ రోడ్లు, గోకులాల షెడ్లకు సంబంధించిన పెండింగ్ బిల్లులు రూ.40 కోట్ల వరకు విడుదల కావల్సి ఉంది. మరో రూ.50 కోట్ల పనులకు సంబంధించిన బిల్లులు అప్లోడ్ చేయాల్సి ఉంది. సీసీ రోడ్లు, గోకులం షెడ్లకు సంబంధించి డిసెంబర్ 13వ తేదీ వరకు చేసిన పనులకు సంబంధించిన బిల్లులు పూర్తిగా చెల్లించడం జరిగింది. గత రెండు నెలలుగా గోకులం షెడ్డు, సీసీ రోడ్ల సంబంధించి నిధులు రాకపోవడంతో చిత్తూరు జిల్లాలో గోకులం షెడ్లు సిమెంట్ రోడ్ల పనులు ఆశించిన మేరకు జరగడం లేదు.

ప్రజాశక్తి- యాదమరి: ఐదేళ్ల తర్వాత గత నవంబర్ నుంచి పెద్ద ఎత్తున, గోకులం షెడ్ల నిర్మాణం, సిమెంటు, తారు రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. చిత్తూరు జిల్లాలో 31 మండలాల్లో 2300 సిమెంట్ రోడ్లు పనులు మంజూరయ్యాయి. 1000 పనులకు పైగా పూర్తయ్యాయి. సీసీ రోడ్లకు సంబంధించి రూ.29.83 కోట్లు పెండింగ్ బిల్లులు విడుదల కావలసి ఉంది. గోకులం షెడ్లు 2300 మంజూరు అయితే 1275 గోకులం షెడ్లు పూర్తయ్యాయి. మిగిలిన వివిధ దశల్లో పనులు జరుగుతున్నాయి. గోకులం షెడ్లకు సంబంధించి రూ.9.30 కోట్లు బకాయిలు విడుదల కావలసి ఉంది. వచ్చే నెలాఖరులోపు చిత్తూరు జిల్లాలో మంజూరైన గోకులం షెడ్లు, సిమెంట్ రోడ్లు పనులు పూర్తిచేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఆ దిశగా ఉపాధి అధికారులు కృషి చేస్తున్నారు.

పనుల్లో లోపించిన పురోగతి...

గత రెండు నెలలుగా ప్రభుత్వం మెటీరియల్ కాంపౌండ్ నిధులు కాకపోవడంతో మిగిలిన పనులు నత్తనడగ్గా జరుగుతున్నాయి. మార్చి నెలాఖరులోపు పనులు పూర్తిస్థాయిలో పూర్తి చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. పనులు చేసేవారిలోను భరోసా కల్పించేందుకు వారంలో ప్రతి గురువారం చెల్లింపులు చేశారు. పనులు వేగంగా జరుగుతున్న దశలో నిధుల కొరత ఏర్పడడంతో ఇబ్బందిగా మారింది. సకాలంలో బిల్లులు చెల్లింపులు నిలిచిపోవడంతో రోడ్ల పనుల్లో పురోగతి కొరబడింది. మిగిలి ఉన్న పెండింగ్ పనులు ప్రారంభించేందుకు ఎవరు ఆసక్తి చూపడం లేదు. ఈ ప్రభావం చిత్తూరు జిల్లాలోని పలు మండలాల్లో పనులు ప్రారంభించిన బిల్లు సకాలంలో రాకపోవడంతో ప్రారంభించ పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయి.

ఉపాధి కూలీలకు వేతన బకాయిలు

జిల్లాలో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు జనవరి 13 నుండి వేతన బకాయిలు విడుదల కావలసి ఉంది. ఉపాధి కూలీలకు ఫన్ ట్రాన్స్ఫర్ ఆర్డర్ అప్లోడ్ చేసిన 15 రోజుల్లో కూలీలకు వేతనాలు చెల్లించాలి. నెలరోజుల పైగా గడుస్తున్నా వేతనాలు లేక కూలీలు ఎదురుచూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంబంధం లేకుండా కూలీలకు బ్యాంకు ఖాతాలకి కేంద్ర ప్రభుత్వం నుండి వేతనాలు జమ చేస్తుంది. చిత్తూరు జిల్లాకు కేటాయించిన ఉపాధి బడ్జెట్ దినసరి కూలీల వేతనాలు సంఖ్య మార్చిలో పూర్తి చేయాల్సి ఉంది. వేతనాలు సకాలం రాకపోవడంతో ఉపాధి కూలీలు పనులు రావడానికి వెనుకడుగు వేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం సకాలంలో కూలీల పెండింగ్ వేతనాలు విడుదల చేస్తే జిల్లా అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చే అవకాశం ఉంది.

నిధులు విడుదల చేసిన వెంటనే వారి ఖాతాలకు జమ చేస్తాం

- రవి కుమార్, జిల్లా ఉపాధి సంచాలకులు

ఉపాధి పథకం కింద గ్రామాల్లో చేపట్టిన సిమెంట్ రోడ్లు, గోకులం షెడ్లకు సంబంధించిన, మెటీరియల్ కాంపోనెంట్ బిల్లులు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే వారి ఖాతాలకు జమ చేస్తాం.



గోకులం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జిల్లా ఉపాధి సంచాలకులు రవి కుమార్



బిల్లులు చెల్లించాలని ఏపీడీ సుబ్రహ్మణ్యంను అడుగుతున్న రైతు

విరివిగా రుణాలు ఇవ్వండి : కలెక్టర్



జిల్లా సహకార అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ అభివృద్ధిలో భాగంగా కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో 2025వ సంవత్సరంను అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో జిల్లా సహకార అభివృద్ధి కమిటీ తొలి సమావేశం జిల్లా కలెక్టర్, ఛైర్మన్ అధ్యక్షతన జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి, వ్యవసాయ, పశు సంవర్ధక, సంబంధిత సభ్యులతో జిల్లా సహకార అధికారి కన్వీనర్ సెక్రెటరీగా తొలి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ అభివృద్ధిలో భాగంగా కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళదామని ఇందుకు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకొని పని చేయాలని ఆదేశించారు. జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల పనితీరు మరింత మెరుగుపడాలని తద్వారా అర్హులైన అన్ని వర్గాల ప్రజలకు, రైతులకు మరింత మేలు జరిగేలా పనిచేయాలన్నారు. పారదర్శకంగా అర్హులైన వారికి రుణాల మంజూరు, రికవరీపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. జిల్లాలో సహకార సంస్థ మేనేజర్లు క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లాలని, రైతులకు రుణాల మంజూరులో గల సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలన్నారు. వ్యవసాయ భూమికి సంబంధించి రికార్డులు సరిగా లేనిపక్షంలో రుణాలు మంజూరు కావడం లేదని, మండలస్థాయిలో విఆర్‌ఓ, విఏఓలు సమన్వయంతో సమస్యకు పరిష్కారం దొరుకుతుందని, అవసరం అయితే జిల్లాస్థాయిలో తహశీల్దార్లతో సమీక్షించి చర్యలు తీసుకుంటామన్నారు. సిబిల్ స్కోర్ తక్కువగా ఉన్న పరిస్థితులలో సైతం రుణాలు మంజూరులో జాప్యం జరుగుతుందని, బ్యాంకు వారితో స్వయంగా మాట్లాడి సమస్యలను పరిష్కరించాలన్నారు. పశువుల పెంపకంను ప్రోత్సహించడంలో భాగంగా పాడి రైతులకు బ్యాంకు రుణాల పొంది పశువులు కొనుగోలు చేసేలా పశు సంవర్ధక శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి రైతులకు రుణాల మంజూరుకు సంబంధించి నివేదికను సమర్పించాలన్నారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల పనితీరు మరింత మెరుగుపడాలన్నారు. పశు సంవర్ధక శాఖకు సంబంధించి ఉన్న కోఆపరేటివ్ సొసైటీ సభ్యులకు రుణాల మంజూరు విధివిధానాలపై అవగాహన కల్పించడంతోపాటు వీరి ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలన్నారు. రైతులకు వ్యవసాయ, పాడి ఆవుల రుణాలకు సంబంధించి విలేజ్ అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్ అసిస్టెంట్‌లు, పంచాయత్ సెక్రెటరీలతో త్వరలో సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రాథమిక పరపతి సంఘాల పనితీరు వాటి విధి విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలని, విద్యార్థులు కూడా సొసైటీలుగా ఏర్పడేలా విద్యాశాఖ అధికారులతో సమన్వయం చేసుకొని పనిచేయాలని సూచించారు. అంతర్జాతీయ సహకార సంవత్సరంగా 2025న ప్రకటించిన నేపథ్యంలో అందుకు సంబంధించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్, జెసి సంబంధిత అధికారులు ఆవిష్కరించారు. జిల్లా సహకార అధికారి నాగవర్ధన, డిసిసిబి సీఈఓ శంకర్ బాబు, డిపిఓ సుధాకర్‌రావు, డీఈవో వరలక్ష్మి, వ్యవసాయ పశుసంవర్ధక శాఖల అధికారులు మురళీకృష్ణ డాక్టర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ఉరి తాడు 'ట్రాన్స్‌పోర్ట్ బిల్లు'

పుంగనూరులో ఆటోనగర్ ఏర్పాటు చేయాలి
సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గంగరాజు



నూతన కమిటీ సభ్యులతో సిఐటియు ఉపాధ్యక్షులు గంగరాజు

ప్రజాశక్తి- పుంగనూరు: కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన ట్రాన్స్‌పోర్టు బిల్లు ఆటో కార్మికుల మెడకు ఉరితాడు లాంటిదని సిఐటియు జిల్లా అధ్యక్షులు వాడ గంగరాజు అన్నారు. పట్టణంలోని పాత బస్టాండ్ ఆజాద్ ఆటో డ్రైవర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం శనివారం ఆ సంఘ అధ్యక్షుడు అంజాద్ బాష అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వాడ గంగరాజు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన ట్రాన్స్పోర్ట్ కార్మికుల మెడకు ఉరి తాడు లాంటి ట్రాన్స్పోర్ట్ బిల్లు పెట్టడం దారుణమని వెంటనే ఉపసరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆ బిల్లు అమలు చేస్తే ప్రధానంగా కోట్లాది మంది ఆటో కార్మికులు నష్టపోతారని తెలిపారు. చదువుకున్న యువకులు ఉపాధి లేక ఆటో రంగాన్ని ఎంచుకొని సొంతంగా జీవనం సాగిస్తుంటే వారిపై కూడా దాడి చేయడం ఏమిటని ప్రశ్నించారు. అమ్మ పెట్టదు.. అడుక్కునివ్వదు.. అనే చందంగా ప్రభుత్వం ఉపాధి చూపించదు.. ఉపాధి పొందుతున్న ఆటో కార్మికులపై దాడి చేయడం దుర్మార్గమన్నారు. గత పది సంవత్సరాలుగా ట్రాన్స్పోర్ట్ బిల్లు అమలు కాకుండా దేశవ్యాప్తంగా డ్రైవర్లందరూ అనేక పోరాటాలు చేస్తుంటే కొంచెం వెనక్కి తగ్గిన ప్రభుత్వం ప్రస్తుతం వేగం పెంచిందని తెలిపారు. ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో అత్యధిక ఆదాయం ట్రాన్స్పోర్ట్ కార్మికుల నుంచి వస్తున్నది. మరి ఇలాంటి కీలకమైన రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నం చేయడం సిగ్గుచేటు అన్నారు. ఆటో కార్మికులు ప్రజలకు అనేక రకాల సేవలు అందిస్తున్నారని ఈ రంగాన్ని సేవా రంగంగా గుర్తించి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పుంగనూరు పట్టణంలో ఉన్న ఆటో కార్మికులకు ఒకే ప్రాంతంలో ఇళ్లస్థలాలు ఇచ్చి ఆటోనగర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో జరిగే పోరాటాల్లో కార్మిక వర్గం ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల వస్తువులకి జీఎస్టీ అమలు చేస్తున్నదని మరి డీజిల్, పెట్రోల్ వాటిపై ఎందుకు జీఎస్టీ అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఆటో డ్రైవర్లను ఆదుకోకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు మురళిలతో పాటు ఆటోడ్రైవర్‌లు పాల్గొన్నారు. అనంతరం ఆజాద్ ఆటోడ్రైవర్ యూనియన్ సిఐటియు అనుబంధంగా నూతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. అధ్యక్షులుగా అంజాద్ బాష, మహబూబ్ బాషా, నవాజ్‌లతో పాటు 15 మందిని కమిటీని ఏర్పాటు చేశారు.

లక్ష్మీపురంలో శ్మశాన రగడ

రౌడీలతో భయభ్రాంతులకు గురిచేసిన వైనం
దారిచ్చే ప్రసక్తే లేదని తేల్చిన గ్రామస్తులు



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న లక్ష్మీపురం దళితులు

ప్రజాశక్తి- కార్వేటినగరం: పచ్చునిపల్లెల్లో రౌడీల ఎంట్రీతో భయభ్రాంతులు మొదలైయ్యాయి. కార్వేటినగరం మండలం లక్ష్మీపురం శ్మశాన రగడ చిలికిచిలికి గాలివానగా మారింది. పార్టీ రంగులు పులుముకోవడంతో ఆ గ్రామం ఏకతాటిపై నిలబడి శ్మశానంలో వ్యవసాయ భూములకు శాస్వత రోడ్డు ఇచ్చే ప్రసక్తి లేదని భీష్మించకుంది. తాత్కాలికంగా రాకపోకలు సాగించడానికి ఎలాంటి అభ్యంతరం లేదని గ్రామస్తులు తేల్చి చెప్పారు. గత కొంతకాలంగా సాగుతున్న శ్మశాన సమస్య ముదరానికి అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు కారకుడని, ఎమ్మెల్యే పేరుచెప్పి ఎమ్మెల్యేకి అత్యంత సన్నిహితుడని అంటూ అక్కడ హల్చల్ చేస్తున్నాడని.. ఇది ఎమ్మెల్యే గుర్తించాలని, లేనిపక్షంలో ఆయనకు గ్రామాల్లో చెడ్డపేరు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. వారం క్రితం చిత్తూరు నుంచి సుమారు 30 మందికిపైగా వాహనాల్లో వచ్చి రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు పీకేసి గ్రామానికి వచ్చి మహిళలను భయభ్రాంతులకు గురి చేయడంతో గ్రామస్తులు శనివారం తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. రౌడీలతో దాడిచేసేందుకు యత్నంచిన వ్యక్తికి శ్మశానంలో దారికల్పించడం కుదరదన్నారు. గ్రామస్థాయి సమస్యలపై రాజకీయరంగు పులుముతున్న వ్యక్తి అధికారులు ఎలా వత్తాసు పలుకుతారని అసహనం వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయకపోతే జాతీయ రహదారిపై నిరసన తెలిపేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. అధికార పార్టీలో ఉన్న ధనవంతులకు ఓ న్యాయం, పేద దళితులకు ఒక న్యాయమా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం దళితుల శ్మశానంపై అధికారపక్షం డేగ కన్నుపడకుండా గ్రామస్తులకు న్యాయం చేయాలని తహశీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందించారు.

ప్రభుత్వ భూమిలోని దారిలో ఎవరైనా వెళ్లొచ్చు..

- నాగరాజు, తహశీల్దార్

లక్ష్మీపురం దళితవాడకు 284/2లో కుంట పరంబోకు, ప్రభుత్వ భూమి ఉంది. అందులో దళితవాడకు శ్మశానవాటిక అనుతులున్నాయి. అయితే శ్మశాన వాటికకు పైన ఉన్న రైతుల వ్యవసాయ భూములకు రాకపోకలు, పంట నూర్పడి సమయంలో వాహనాలు రావడానికి అనుమతులున్నాయి. ఇది మా భూమి రావడానికి వీలేదు అనడానికి ఎవ్వరికీ అధికారం లేదు. అలాగే ప్రభుత్వ భూమిలో ట్రెన్సీ ఏర్పాటు చేయడం నేరం. ఇప్పటికే రెవెన్యూ సిబ్బంది సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయడం జరిగింది.

రూ.3,996 కోట్లు బడ్జెట్ ప్రతిపాదనలకు ఆమోదం



జెడ్‌పి సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో జిల్లా ప్రజాపరిషత్ ద్వారా 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.3996 కోట్లు బడ్జెట్ ప్రతిపాదనలకు జిల్లా జెడ్పి స్థాయి సంఘం ఆమోదం తెలిపిందని జెడ్పి ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు తెలిపారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జెడ్పి ఛైర్మన్ అధ్యక్షతన 1, 2, 4, 7 జెడ్పి స్థాయి సంఘం సమావేశాలు, ధనుంజయ రెడ్డి అధ్యక్షతన 3వ, భారతి అధ్యక్షతన 5వ, రమ్య అధ్యక్షతన 6వ స్థాయి సంఘం సమావేశాలు జరిగాయి. జెడ్‌పి సీఈఓ రవికుమార్ నాయుడు, డిప్యూటీ సీఈవో జుబేదా బేగం, అధికారులు పాల్గొన్నారు. జెడ్పి ఛైర్మన్ మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ పరిధిలో చేపట్టిన ఇంజినీరింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. డిఆర్‌డిఏ ద్వారా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రతినెలా 5,60,785కి పెన్షన్‌ల పంపిణీ చేపడుతున్నామని ఏప్రిల్ 2024 నుండి ఫిబ్రవరి 2025 వరకు రూ.2,285కోట్లు పంపిణీ చేశామని, బ్యాంక్ లింకేజీ ద్వారా 19,425 మందికి రూ.1,742 కోట్లు, స్త్రీ నిధి ద్వారా 61,569 స్వయం సహాయక సభ్యులకు రూ.390 కోట్లు పంపిణీ చేశామని డిఆర్‌డిఏ పీడీ సభకు వివరించారు. గృహ నిర్మాణశాఖ ద్వారా ఉమ్మడి జిల్లా పరిధిలో నిర్మాణాలు చేపట్టిన 1,54,300 గృహాలకు గానూ 90,081 గృహ నిర్మాణాలు పూర్తి చేయడమైనదని, గృహ నిర్మాణాలకు రూ.2051 కోట్లు ఖర్చు చేశామని, 847 లే ఔట్లకు రూ.102 కోట్ల వ్యయంతో నీటి వసతి కల్పించామని గృహ నిర్మాణ శాఖ పీడీ వివరించారు. ఉమ్మడి జిల్లాలో 4,738 పాఠశాలలో డొక్కాసీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకంలో భాగంగా 2,85,900 మంది విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహార భోజనం అందిస్తున్నామని డీఈవో తెలిపారు. ఎన్‌టిఆర్ వైద్యసేవ ఆసరా ద్వారా 23524 మందికి రూ.11.93 కోట్లు చెల్లించామని డిఎంఅండ్‌హెచ్‌ఓ సభకు వివరించారు. పంచాయతీ రాజ్‌శాఖ ద్వారా ఉమ్మడి జిల్లాలో ఎంజిఎన్ఆర్ ఈజిఎస్ ద్వారా రూ.29 కోట్లతో 3312 సిసి రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించి 2080 పనులు పూర్తి చేశామని, ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన కింద రూ.18కోట్లతో 23 పనులు మంజూరు చేశామని పంచయతీ రాజ్ ఎస్ఈ సభకు వివరించారు. గ్రామీణ నీటి పారుదల శాఖ ద్వారా ఉమ్మడి జిల్లాలో జల్‌జీవన మిషన్, ఎంపి ల్యాడ్స్, జెడ్‌పి పనులు మొత్తం 5289 పనులు మంజూరు చేసి రూ.16.60 కోట్లతో 4,213 పనులు పూర్తి చేశామని ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఈ సభకు వివరించారు. విద్యుత్ శాఖ ద్వారా ఉమ్మడి జిల్లాలో 1,7,792 మంది ఎస్‌సి, ఎస్‌టిలకు రూ.5.70 కోట్లు సబ్సిడీ కింద విద్యుత్ అందిస్తున్నామని, వ్యవసాయ సర్వీసులకు 7గంటలు నిరంతరాయంగా, రైతుల కోరిక మేరకు రెండు దఫాలుగా పగటి పూట విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని ఏపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఈ సభకు వివరించారు. జిల్లాలో రహదారుల పై గుంతలు పూడ్చే కార్యక్రమం చేపట్టామని, ఆర్ అండ్ బి శాఖ పరిధిలో రూ.1111 కోట్లతో 10 పనులు ప్రారంభించి 4 పనులు పూర్తి చేయగా 5 పనులు పురోగతిలో ఉన్నాయని ఆర్ అండ్ బి ఈఈ సభకు సభకు వివరించారు. పిఆర్, ఆర్‌డబ్ల్యుఎస్ఈఈ చంద్రశేఖర్ రెడ్డి, విజయ్‌కుమార్, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఇస్మాయిల్, డిఆర్‌డిఎ పీడీ పాల్గొన్నారు.

25న సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి -బంగారు పాళ్యం: బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు 25వ తేదీ మంగళవారం ఉదయం 10.30 గంటలకు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని లబ్ధిదారులు తమ వెంట ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, మూడు పాస్ పోర్టు ఫొటో లు తీసుకురావాలని ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు జిరాక్స్ కాపీలు కూడా తీసుకు రావాలని ఇన్‌ఛార్జి ఎంపీడీవో శ్రీధర్ తెలిపారు. ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరూ ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

13 చేతి బోర్లు ఏర్పాటు: సర్పంచ్



చేతి బోర్లను పరిశీలిస్తున్న సర్పంచ్ గోవిందయ్య

ప్రజాశక్తి - వెదురుకుప్పం: వేసవిని దృష్టిలో పుంచుకుని వేసవిలో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా వుండేందుకు బొమ్మయ్య పల్లి పంచాయతీలో కలెక్టర్ ఆదేశాలతో సుమారు 13 చేతి బోర్లను సిద్ధం చేయనున్నట్లు బొమ్మయ్యపల్లి సర్పంచ్ గోవింద య్య పేర్కొన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లా డుతూ కలెక్టర్ ఆదేశాలతో బొమ్మయ్యపల్లి పంచాయతీలో సుమారు 13 చేతి బోర్లను తాగునీటి కోసం సిద్ధం చేస్తామని తెలిపారు. వేసవికాలంలో తాగునీటి బోర్లకు విద్యుత్తు అంత రాయం ఏర్పడినప్పుడు ప్రజలు తాగు నీటికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో చేతి బోర్లు ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. ప్రజలకు ఏ అవసరం వచ్చినా తాను అందు బాటులో ఉంటానని పేర్కొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి



కృష్ణమ్మ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి- వెదురుకుప్పం: వెదురుకుప్పం మండలం, తిరుమలయ్య పల్లి పంచాయతీ మాజీ సర్పంచ్ కృష్ణమ్మ (50) శనివారం మరణించారు. ఆమె గతంలో ఆ పంచాయతీ ప్రజలకు సేవలు అందించారు. ఆమె సొంత గ్రామం గుర్రంవారి కండ్రిగ కావడంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆమె అంత్య క్రియలు ముగిశాయి.

వినతుల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే థామస్

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండలంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గ్రీవెన్స్ డే ను ప్రారంభిం చారు. శనివారం ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్ హాజరయ్యారు. మొత్తం 230 వినతులు ఆయనకు ప్రజలు తమ సమస్యలతో వినతి పత్రాన్ని అందించారు. ఇందులో ఎక్కువ భాగం 90 రెవెన్యూ సమస్యలపైనే అందాయి. మిగిలినవి వివిధ శాఖలకు సంబంధించినవి అర్జీ దారుణతో మాట్లాడుతూ సాధ్యమైనంత తొందరగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అధికారులతో చర్చించి అర్జీదారులకు పరిష్కారం చూపుతామన్నారు. భద్రత ఏర్పాట్లను సీఐ శ్రీనివాసంతి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు చంద్రశేఖర్, ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి, పి ఆర్ డి ఈ ఆనంద్ రెడ్డి, హౌసింగ్ ఏఈ శ్రీధర్, విద్యుత్ శాఖ ఏఈలు తనిగవేలు, వరదరాజులు, ఉపాధి హామీఏపీవో శ్రీనివాసులు, వెలుగు ఏపిఎం ఫరీద్ మస్తాన్, ఆర్ ఐ ఏకాంబరం, టిడిపి నాయకులు కృష్ణమ నాయుడు, స్వామి దాస్, శ్రీధర్ యాదవ్, దేవ సుందరం, జ్యోతి యాదవ్, నియాజ్ అలీ, జీవరత్నం, నీరజాక్షులరెడ్డి, మోహన్ నాయుడు, శంకర్, సంపత్, సగి, పలువురు నాయకులు పాల్గొన్నారు.




గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందస్వామి

గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా గోవిందస్వామి

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శిగా గోవిందస్వామిని రాష్ట్ర గ్రీన్ అంబాసిడర్ ఇన్‌ఛార్జి నాగ సుబ్బయ్య ప్రకటించారు. మండల కేంద్రమైన ఎస్ఆర్ పురం లోని పుల్లూరు క్రాస్ రోడ్డు చెందిన గోవిందస్వామిని గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా గ్రీన్ అంబాసిడర్ గోవిందస్వామి మాట్లాడుతూ... రాష్ట్ర జిల్లా నియోజకవర్గ మండల నాయకులు ఈ పదవిని నా పై నమ్మకంతో ఇచ్చారు. శక్తి వంచన లేకుండా గ్రీన్ అంబాసిడర్ కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తానని ఆనందం వ్యక్తం చేశారు. తనకు మద్దతునిచ్చిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

జ్ఞాన జ్యోతి శిక్షణా కేంద్రం సందర్శన

ప్రజాశక్తి -పలమనేరు: పలమనేరులోని స్థానిక గవర్నమెంట్ పాఠశాలలో నిర్వహిస్తున్న సెకండ్ స్పెల్ జ్ఞానజ్యోతి అంగన్‌వాడీ ట్రైనింగ్ ను నాలుగవ రోజు జిల్లా గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఇంద్రాణి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌శాడీ కేంద్రాల్లో చిన్నారులకు ప్రీ ప్రైమరీ స్కూల్లో బోధించడానికి జ్ఞాన జ్యోతి 120 రోజుల శిక్షణ ఇస్తారు. అంగన్వాడీ టీచర్లకు అందరికీ పిల్లల అభ్యాసనను బలోపేతం చేయడానికి పిల్లలకు ఆటలు పాటలు ద్వారా అభ్యాసనను చేయడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ లు పి లీలారాణి సి బాల సుందరం , గవర్నమెంట్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు షంషేర్ ,రిసోర్స్ పర్సన్స్ లు జి నాగరాజు త్రిలోక్ చందు, అంగన్‌వాడీ సూపరు వైజర్లు మాధవి లత, ద్రాక్షాయిని, నగ్మా ,సిఆర్ఎం టి లు పాల్గొన్నారు.



చెత్త బుట్టలు పంపిణీ చేస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

చెత్తబుట్టలు పంపిణీ

ప్రజాశక్తి -రొంపిచర్ల : స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం పుంగనూరు నియోజకవర్గం రొంపిచర్ల మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో చల్లా రామచంద్రారెడ్డి శనివారం చెత్త బుట్టలు పంపిణీ చేశారు. అనంతరం రొంపిచర్ల పట్టణంలోని వీధి కాలువలను పరిశీలించి ఎక్కడ ఎలాంటి సమస్య ఉన్న వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు . పుంగనూరు నియోజకవర్గ ప్రజలు ఏలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకువస్తే ఆయా శాఖల అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యాల రమణ, మైనారిటీ నాయకులు సయ్యద్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర

ప్రజాశక్తి -కార్వేటినగరం: విద్యార్థి దశనుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌సి రాఘవేంద్ర అన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ బాలికలపై వివక్ష తల్లిదండ్రుల నుంచే మొదలవుతోందని అధునాతన కాలంలో అలాంటి వాటికి తావివ్వకూడదన్నారు. బాలికలు పోక్సో చట్టంపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సెల్ ఫోన్ల ద్వారా వచ్చే మెసేజ్ లకు బాలికలు దూరంగా ఉండాలని, వాటి ద్వారా సైబర్ నేరగాళ్లు అమ్మాయిలను మోసం చేసి హింసించే అవకాశం ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు బాలికల రక్షణ చట్టాలను వారికి క్షుణ్ణంగా వివరించాలని పేర్కొన్నారు. ఎంఈవో మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలంటే వారికి తప్పనిసరి విద్య ఎంతో అవసరమన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్న నేటి సమాజంలో తల్లిదండ్రులు బాలికలను ఉన్నత చదువులకు పంపడానికి వెనుకా డుతున్నారని గుర్తు చేశారు. పురుషులకు దీటుగా రాణిస్తున్న మహిళలకు పూర్తి స్వేచ్ఛను కల్పించాలన్నారు. కొందరు తల్లిదండ్రులు అవివేకంతో ఆడ పిల్లలను ఉన్నత చదువులకు పంపడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు నాగరాజు, ఎస్ఐ రాజ్‌కుమార్, పంచాయతీ అధికారి నాగరత్నమ్మ, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



మృతుడి కుటుంబానికి చెక్కును అందిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ట్రాక్టర్ ప్రమాదంలో దురదృష్ట వశాత్తు ప్రాణాలు కోల్పోయిన దామోదరం నాయుడుకు టుం బానికి ప్రభుత్వం ద్వారా రూ.2 లక్షల ఆర్థిక సాయం చేశారని కలెక్టర్ సుమిత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెనుమూరు మండలం జట్టిగుండ్లపల్లి గ్రామానికి చెందిన కె దామోదర నాయుడు ఇటీవల ట్రాక్టర్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారని, బాధితుడి భార్య కే కరుణ కుమారి ఈ నెల 17వ తేదీన జిల్లా సచివాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో భాగంగా ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం అందించాలని వినతిని సమర్పించారని, బాధితుని కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు రూ.2 లక్షల చెక్కును ప్రభుత్వం తరపున అందించారని కలెక్టర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీ కృష్ణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




గ్రామాల్లో చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఈవో అండ్ పిఆర్‌డి పురుషోత్తం

అన్ని గ్రామాల్లో చెత్త సేకరణ

ప్రజాశక్తి -వెదురుకుప్పం: అన్ని గ్రామాలలో పంచాయతీ రాజ్ కమిషనర్ , కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి వారి ఆదేశాల మేరకు శనివారం, ఆదివారాల్లో ఉదయం 6 నుండి 10 గంటల వరకు ఇంటింటికీ చెత్త సేకరించనున్నట్లు ఈవో అండ్ పిఆర్‌డి పురుషోత్తం. తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ వెదురుకుప్పం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఇంటింటికీ చెత్త సేకరణ నిర్వహిస్తా మన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల పంచా యతీ పచ్చికాపల్లం, వెదురు కుప్పం, సంతబైలు, మొండి వెంగనపల్లి గ్రామ పంచాయతీలలో నిర్వహిస్తున్న ఇంటిం టికీ చెత్త సేకరణ కార్యక్రమాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మధు, వెంకటేష్, రమేష్, బాలకృష్ణ, సంక్షేమ విద్యా సహాయకుడు సుదర్శన్ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కార్వేటినగరం: రెవెన్యూ అధికారులు చేపడుతున్న రీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల తహశీల్దారు నాగరాజు పేర్కొన్నారు. మండల పరిధిలోని కత్తెరపల్లిలో శనివారం రీ సర్వే సందర్శించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రీ సర్వే నిర్వహిస్తోందని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందులో ఎలాంటి సమస్యలు వున్నా తమ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. సిబ్బంది పారదర్శకంగా విధులను నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌డీటీ స్వరూపరాణి, మండల సర్వేయర్ బాబు, విలేజీ సర్వేయర్లు పలువురు పాల్గొన్నారు.



నేటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: దక్షిణ కాశిగా పేరొందిన చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం మొగిలిలో స్వయంభువుగా వెలసిన శ్రీ కామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి ఆలయంలో ఆదివారం నుండి శివరాత్రి మహోత్సవాలు ప్రారంభమవుతుందని ఆలయ వంశపార్య ధర్మకర్త విజయ్ కుమార్ కార్య నిర్వహణ అధికారి ముని రాజులు తెలిపారు. వ్యాపారంలో అనుకున్న దానికంటే అధిక లాభాలు రావడంతో వ్యాపారస్తులు తమ భక్తికి నిదర్శనంగా మొగిలీశ్వరునికి మొగిలి వద్ద ఆలయం నిర్మించారు. ఆనాటి నుంచి నేటి వరకు మహాశివరాత్రి బ్రహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రతి సంవత్సరం మహాశివరాత్రి సందర్భంగా పది రోజులపాటు అత్యంత వైభవంగా బ్రహ్మోత్స వాలు జరుగుతాయి. చిత్తూరు జిల్లా వాసులే కాకుండా తమిళనాడు, కర్ణాటక భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామిని దర్శించుకుంటారు. ఈ దేవాలయం చుట్టూ ఎత్తైన కొండలు, పచ్చటి పొలాలు, ప్రకృతి ప్రసాదించిన వింజమరాలా అన్నట్లు చల్లటి గాలికి అటుఇటు కదలాడే చెట్లతో ఆహ్లాదకరంగా కనిపించే ఈ ప్రాంతాన్ని చూస్తే చూపరులకు అడుగు ముందకు పడదు. ఈ ఆలయాన్ని బంగారుపాళ్యం జమీందారు కుటుంబ సభ్యులు అభివృద్ధి చేశారు. ఇప్పటికీ ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలుగా జమిందారి కుటుంబసభ్యులే వ్యవహరి స్తున్నారు.

ఉన్నత విద్యకు ఉత్తమ వేదిక బిసిఎన్ విద్యా సంస్థలు



జ్యోతి ప్రజ్వలనచేసి వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న బిసిఎన్ విద్యా సంస్థల యాజమాన్యం

ప్రజాశకి-కుప్పం టౌన్: కుప్పం విద్యార్థుల ఉన్నత విద్యకు బిసిఎన్ విద్యా సంస్థలు ఉత్తమ వేదిక అని కుప్పం డిగ్రీ కళాశాల ఉపాధ్యక్షులు సాగర్ రాజు పేర్కొన్నారు. కళాశాల 15వ వార్షికోత్సవాన్ని ఛైర్‌పర్సన్ శాంతా నాగరాజు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా చిత్ర పరిశ్రమ సినీ దర్శకులు అనుదీప్ దేవ్, ముఖ్య అతిథిగా బిసి ఎన్ విద్యా సంస్థల వ్యవ స్థాపక అధ్యక్షులు బిసి నాగరాజు విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్రవిడ కూడలి లోని కుప్పం నియోజకవర్గంలో మారుమూల గ్రామాల విద్యార్థు లకు సైతం ఉత్తమ విద్యను అందించే లక్ష్యంతో బిసిఎన్ విద్యా సంస్థలు ప్రారంభించారని తెలిపారు. తమ కళాశాల విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. తమ విద్యార్థులు సైతం ఉత్తమ విద్యను అభ్యసిస్తూ, ఇతర రంగాల్లోనూ రాణించడం హర్షించదగ్గ విషయం అన్నారు. ముఖ్యంగా తమ విద్యార్థులు పోటీ పరీక్షలలో, క్రీడా పోటీలలో విశ్వ విద్యాలయ, సౌత్ జోన్ స్థాయిలో ప్రతిభ కనబరచడం తమ కళాశాలకు గర్వకారణమన్నారు. కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది అంకిత భావంతో విద్యార్థులకు సేవలు అందిస్తున్నారని, తమ కళాశాల న్యాక్ గుర్తింపు పొందడం ఇందుకు నిదర్శన మన్నారు. అనంతరం వివిధ పోటీలలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలలో విశిష్ట అతిథి తన ఆట పాటలతో సభికులను అలరించారు. ఈ కార్యక్రమంలో కుప్పం ఇంజనీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ సాగర్ రాజు, బిసిఎన్ విద్యాసంస్థల అధ్యాపకులు, సిబ్బంది, డిగ్రీ కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఒకరి రక్తదానం ముగ్గురికి ప్రాణదానం



దాతలకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి -కుప్పం టౌన్ : ఒక వ్యక్తి చేసే రక్తదానం వల్ల ముగ్గురు ప్రాణాలను రక్షించే అవకాశం ఉంటుందని కుప్పం లయన్స్ క్లబ్ ఆఫ్ వారియర్స్ సలహాదారు మహేష్ పేర్కొన్నారు. శనివారం పట్టణ పరిధిలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో లయన్స్ క్లబ్ తరపున రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, ప్రముఖ వైద్యులు డాక్టర్ సురేష్ బాబు విచ్చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, స్థానిక యువత రక్తదానం చేసి తమ సేవా దృక్పథం చాటుకున్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు. అనంతరం పలువురు క్లబ్ సభ్యులు మాట్లాడుతూ క్లబ్ ప్రారంభం నుండి సమాజ సేవలో భాగంగా ఎన్నో రకాల సేవా కార్యక్రమాలు నిర్వహి స్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా రోడ్ల పక్క చెరువు వ్యాపారులకు సహాయ సహ కారాలు అందించడం, పేదల సౌకర్యార్థం వివిధ సేవా కార్యక్రమాలు కొనసా గించడం, అవసరమైన పేదలను తగు విధంగా ఆదుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుప్పం నియోజక వర్గం మైనారిటీ అధ్యక్షులు జాకీర్ అహ్మద్, పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, శాంతిపురం మండల టిడిపి అధ్యక్షులు విశ్వనాథ నాయుడు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి సమస్యనూ పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే



వినతి పత్రాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ పేర్కొన్నారు. శనివారం లక్ష్మీ నగర్ కాలనీ ఎమ్మెల్యే కార్యాలయం ప్రజా దర్బార్ లో ఫిర్యాదుల స్వీకరణను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిళలు, యువత, వృద్ధులు, ప్రత్యేక ప్రతిభావంతులు, వివిధ సమస్యలపై వచ్చిన ప్రజలను ఆప్యాయంగా పలకరించి వారి సమస్యలను సావధానంగా విన్నారు. పలు సమస్యలు అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. నీటి సరఫరా, పారిశుద్ధ్యం, వీధిలైట్లు వంటి సమస్యలను వేగంగా పరిష్కరించాలన్నారు. రోడ్లు, మౌలిక సదుపాయాల వినతులకు క్షేత్రస్థాయి పరిశీలన చేసి అంచనాలు రూపొందించి సమర్పించాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. తమ పరిధిలోని సమస్యలను నగర పాలక అధికారులు, రెవెన్యూ సమస్యలను తహశీల్దారులు ప్రత్యేక శ్రద్ధ వహించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి అర్జీ పై క్షేత్రస్థాయి విచారణ నిర్వహించి నివేదిక ఇవ్వాలన్నారు. ఎమ్మెల్యే వారికి వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి వేగంగా సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆర్థికపరం కానివాటిని వేగంగా పూర్తిచేయాలని, ఆర్థికపరమైన వాటిపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ ఎస్ అముద, కమిషనర్ పి నరసింహ ప్రసాద్, ఎంపీడీవో కె శ్రీనివాసులు, శివరాజ్, తహశీల్దార్లు లోకేశ్వరి, జయంతి, ఎంహెచ్‌వో డాక్టరు లోకేష్, ఎంఈ వెంకటరామి రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బాబుకు క్షమాపణ చెప్పాలి

- జిల్లా ప్రియాంక సేవాదళ్ అధ్యక్షుడు సజ్జిద్ బాషా

ప్రజాశక్తి- పుంగనూరు: తెలంగాణ మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని జిల్లా ప్రియాంక సేవాదళ్ అధ్యక్షుడు ఎస్ సజ్జద్ బాషా శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా తెలంగాణ అభివృద్ధి ఆయన హయాంలో ప్రపంచమంతా చూసిందని, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ సిఎంగా కొనసాగుతున్న 'చంద్రబాబును తన్ని తరిమేశాం తెలంగాణ నుండి' అన్న మాటలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరుడిగా బాధపడి తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలను అవమానించారని వెంటనే క్షమాపణలు చెప్పాలని కోరారు. మాజీ మంత్రిగా ఇలా మాట్లాడడం తగదని, నోరు అదుపులో ఉంచుకోవాలని, గౌరవమైన హోదాలో ఉన్న వ్యక్తిని అవమానించడం మంచిది కాదన్నారు. అవగాహన చేతకాని పాలన వైసిపి ప్రభుత్వం చివరికి చెత్తపై కూడా పన్నులు వేసి ప్రజలను ఇబ్బందికి గురి చేసిందన్నారు. వైఎస్సార్ ప్రభుత్వం కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చెత్త పన్నును పూర్తిగా రద్దు చేసినందుకు కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. మిగిలిన హామీలు త్వరగా అమలు పరచాలన్నారు.

ఘనంగా ఆర్‌కెఎస్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం



మాట్లాడుతున్న ఆర్‌కెఎస్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ స్వరూప

ప్రజాశక్తి - కార్వేటినగరం : కార్వేటినగరంలోని ఆర్‌కెఎస్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల 49 వ వార్షికోత్సవ శనివారం ప్రిన్సిపాల్ పి స్వరూప అధ్యర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రతి విద్యార్థి కళాశాలలో నిర్వహించిన పరీక్షల ప్రశ్నలను జాగ్రత్తగా చదువుకోవడం ద్వారా ఉత్తీర్ణత సాధించ వచ్చున్నారు. ఉన్నత ఫలితాలు సాధించేలా విద్యార్థులకు సూచనలు ఇచ్చారు. మార్చి ఇంటర్ పరీక్షలలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి కాలేజీ కి మంచి పేరు తీసుకురావాలన్నారు. డాక్టర్ కమలాకర రెడ్డి మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. జ్ఞానం ద్వారానే మానవునికి విలువ పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపన్యాసకులు రాజేష్ కుమార్, సుబ్బారావు,మాధవ నాయుడు, రాజేష్, ప్రకాష్ ప్రసంగించారు. ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారని ప్రిన్సిపాల్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ గోవిందస్వామి, కృష్ణకిషోర్, లక్ష్మి, రామకృష్ణ, రామమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

పైప్ లైన్‌కు మరమ్మతు

తాగునీటి సమస్య పరిష్కారం



ప్రజాశక్తి -సోమల: సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు పంచాయతీ పరిధిలోని సామాదిగుట్ట పల్లి గ్రామంలో పైప్ లైన్ పగిలిపోయి తాగునీరు వృథా అవుతుంటే విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి జయశంకర్ శనివారం గ్రామానికి వెళ్లి పైప్ లైన్ పరిశీలించి నూతన పైప్ లైన్ ఏర్పాటు చేశారు. గ్రామంలోని దాదాపు 50 కుటుంబాలకు పైగా నివాసం ఉన్నారని సమస్య తెలిసిన వెంటనే స్పందించిన పంచాయతీ కార్యదర్శి గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

ప్రజాశక్తి - వి కోట : మండల ప్రజలు వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీపీ యువరాజు అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ యువరాజ్ అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల పరిధిలోని వివిధ శాఖల అధికారులు తమ పరిధిలో జరిగిన అభివృద్ధి పనులు సభ దృష్టికి తీసుకొచ్చారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల సూచనల మేరకు నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ పంచాయతీ నిధులు, మండల పరిషత్, అవసరం మేరకు జిల్లా పరిషత్ నిధులను తాగునీటి నివారణ పనులకు వెచ్చించాలని సూచించారు. మండల పరిధిలోని వివిధ రోడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సభ్యులు కోరారు. మండల పరిధిలో ఉపాధి హామీ పనుల వివరాలు ఏపీఓ గౌరీ శంకర్ సభకు వివరించారు. ఉపాధి పనులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని సభ్యులు కోరారు. వేసవి నీటి లభ్యతను బట్టి రైతులు ఆరుతడి పంటలు వేసుకునేలా ప్రజాప్రతినిధులు రైతులకు సూచించాలని అధికారులు కోరారు. రెవెన్యూ సదస్సుల అర్జీలు సత్వరం పరిష్కరించాలని కోరారు. ఆరోగ్యశాఖ, పశువైద్య శాఖలో ఉన్న ఖాళీలను సత్వరం భర్తీ చేసే విధంగా జిల్లా అధికారులకు నివేదికలు పంపాలని సభ్యులు కోరారు. వివిధ శాఖల అభివృద్ధి, పని తీరుపై సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు తమీంఖాన్, లక్ష్మణ్ రెడ్డి, ఎంపీడీవో ఈశ్వరన్నతో పాటు వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

మండల సమావేశంలో అధికారులకు ఎంపిపి యువరాజు సూచన



వసమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి యువరాజు

క్రైం న్యూస్

చోరీ కేసులో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఇంట్లో చోరీ కేసులో నిందితుడు అరెస్టు చేశామని సీఐ శ్రీనివాసంతి తెలిపారు. సీఐ కథనం మేరకు ఈ సంవత్సరం జనవరి నెల 27వ తేదీ రాత్రి గంగాధరనెల్లూరు గ్రామంలో సాఫ్ట్వేర్ ఇంజనీర్ భాను ప్రకాష్ రెడ్డి ఇంట్లో చోరీ కేసులో తమిళనాడు, తిరువన్నామలై జిల్లా, కలశం పాకం తాలూకాకి చెందిన తేమ్మది మంగళంలోని రామ జయం (37)ను మండలంలోని తానా చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలలో భాగంగా నిందితుడను అరెస్టు చేశామని తెలిపారు. నిందితుడు దగ్గర 22 గ్రాముల బంగారు చైను, మరో 8 గ్రాముల బంగారు ఆభరణాలను , నిందితుడు నేరం సమయంలో ఉపయోగించినట్లు పోలీసులు తెలిపారు. కారును స్వాధీనం చెసుకున్నామని తెలిపారు. నిందితుడు రామజయం తమిళనాడులో గతంలో పలు దొంగతనాలు చేసినట్లు, పలుకేసులలో జైలుకు వెళ్లినట్లు తెలిపారు. నిందితుడు రామజయంను రిమాండుకు తరలిస్తున్నట్లు .ఏర్కొన్నారు.

పూరిపాక దగ్ధం

ప్రజాశక్తి - వెదురుకుప్పం: మండలం తిరుమలయ్య పల్లి పంచాయతీకి చెందిన గుర్రంవారి కండిగలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిపాక కాలిపోయింది. బాధితుడు హరి శనివారం మీడియాతో మాట్లాడుతూ తన ఇల్లు ప్రమాద వశాత్తు దగ్ధమైందని, అందులో కొన్ని నిత్యావసరాలు సరుకులు, కొన్ని ఎలక్ట్రికల్ వస్తువు లు కాలిపోయాయని గ్రామస్తులు తెలిపారు. సుమారుగా లక్ష రూపాయలు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

ఇంటింటికీ చెత్త సేకరణ



కోదండరామిరెడ్డి

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇంటింటి నుండి చెత్త సేకరణ ప్రత్యేక డ్రైవ్ ను మండలంలోని 23 పంచాయతీలలో ప్రతి ఇంటింటికి తిరిగి తడి చెత్త పొడి చెత్తను సేకరిస్తున్నామని ఈవో అండ్‌పిఆర్‌డి కోదండరామిరెడ్డి అన్నారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గౌరవ కమిషనర్ వారు ఆదేశాలనుసారం ఉదయం 6 గంటలకే అందరూ అధికారులు గ్రామ పంచాయతీలలో విధులకు హాజరై గ్రామాలలో ఉన్న అన్ని చెత్త కుప్పలు , రోడ్ మార్జిన్, రోడ్ ప్రక్కలలో లో ఉన్న పశువుల పేడ దిబ్బలు తొలగించి, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలకు తరలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

ఎస్టీలుగా గుర్తించండి

ఎమ్మెల్యేకు వాల్మీకుల వినతి

ప్రజాశక్తి - ఫలమనేరు: వాల్మీకులను ఎస్టీలుగా పునరుద్ధరించాలని వాల్మీకి, బోయ సంఘ నాయకులు శనివారం పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని కలసి వినతిపత్రం సమర్పించారు. ఆంధ్ర రాష్ట్రంలో కూడా వాల్మీకులను ఎస్టీలుగా రిజర్వేషన్ పునరుద్ధ రించాలని కోరారు.మనరాష్ట్రంలో వాల్మీకులు బోయ సామానికి వర్గం వారని, ఎస్‌టి రిజర్వేషన్ పునరుద్దరించాలని, 1956 నుండి వివిధ మార్గాల్లో పోరాటాలు చేస్తున్న ఉత్తర భారత దేశంలో కొన్ని ఏజెన్సీ ప్రాంతాల్లో మాత్రం ఎస్టీలుగా గుర్తిస్తూ మైదాన ప్రాంతాల్లో ఉన్న వారిని బీసీబిఏ లుగా గుర్తించారని పక్కనున్న కర్ణాటక రాష్ట్రంలో కమ్ ఎస్టీలుగా గుర్తించారని, తమ కులాల్లో కూడా ఎక్కువమంది సామాజికంగా వెనుకబడి ఉన్నారని, తమను విద్యా, ఉద్యోగాలలో రాజకీయాలలో ఎస్టీలుగా గుర్తించాలని కోరారు. ప్రస్తుతం కేంద్రంలో, రాష్ట్రంలో ఉమ్మడి కూటమి ప్రభుత్వం అధికారంలో వుందని కేంద్రంపై బత్తిడి తెచ్చి వాల్మీకులను ఎస్‌టిల జాబితాలో చేర్చేందుకు కృషి చేసి, తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘ నాయకులు ఎల్ భాస్కర్ నాగేశ్వరరావు, రామచంద్ర, శంకర, రెడ్డప్ప, సుబ్రహ్మణ్యం, పరమేష్ రవి ,చలపతి, నరసింహులు మొదలగు వారు పాల్గొన్నారు.

రిటైర్డు ఉపాధ్యాయుడికి నివాళి

ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్:

వారం రోజుల క్రితం మృతి చెందిన రిటైర్డు ఉపాధ్యాయులు ఆకుల మునుస్వామి(పెద్ద మునుస్వామి) అభిమానులు, బంధువులు, పూర్వ విద్యార్థులు శనివారం ఆయన చిత్రపటంతో సదుం పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పూర్వ విద్యార్థులు, వివిధ రంగాల్లో, వివిధ స్థాయిల్లో ఉన్నవారు ఆయన ఆయన మృతిని తలుచుకుని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన గణితం ఉపాధ్యాయుడుగా సదుం జడ్‌పి హైస్కూలులో అందించిన సేవలు స్మరించుకుని ప్రశంసించారు. ఆయన సేవలను పలువురు విద్యావేత్తలు, రాజకీయ నాయకులు, పాత్రికేయులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వైజయ కుమార్ రెడ్డి, బి సుబ్రహ్మణ్యం, మణి, కృష్ణయ్య, పీడీ కిషోర్, పాత్రికేయులు వుల్లో వల్లి శ్రీనివాసులు, కటారి రామయ్య, జీవి శేషగిరి, గిరీష్, సయ్యద్ బాషా అభిమానులు నరసింహులు, శంకర పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

ప్రజాశక్తి - సోమల: మండల కేంద్రమైన సోమల, మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామాలలోని ప్రజలకు ప్రభుత్వ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ కింద శనివారం తడి పొడి చెత్త ఏ విధంగా వేరు చేసి చెత్త తరలింపు వాహనంలో వేయాలన్న విధానం పై ప్రజలకు అవగాహన కల్పించారు. సోమల కార్యదర్శి ఆనంద్, కందూరు కార్యదర్శి జయ శంకర్ పాల్గొన్నారు.